క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

మానకొండూర్: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. అన్నారం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం పరిశీలించారు. కూలీల సమస్యలు తెలుసుకున్నారు. కూలి డబ్బులు 8 వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సైతం మూడు నెలల నుంచి జీతాలివ్వడం లేదన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు



మానకొండూర్: అరెస్టయిన నాయకులు

మానకొండూర్: అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో బీఆర్ఎస్వీ నాయకులు ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, బీఆర్ఎస్‌వై మానకొండూర్ మండల అధ్యక్షుడు ఆడప శ్రీనివాస్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు రాయికంటి కిరణ్, బీఆర్ఎస్వీ మండల ఇన్‌చార్జి దండబోయిన శేఖర్ ఉన్నారు.

చొప్పదండి: చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో చొప్పదండి పోలీసులు బీఆర్ఎస్‌వై నేతలను శనివారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు భయపడేది లేదని నియోజకవర్గ ఇన్‌చార్జి బందరపు అజయ్‌కుమార్ అన్నారు. మారం యువరాజ్, భక్తు విజయ్‌కుమార్, సరవేణి శ్రీకాంత్, నరేశ్ రావణ్, దాసరి అనిల్ తదితరులున్నారు.

గంగాధర: బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా.. గంగాధర పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్‌రెడ్డితోపాటు మండల అధ్యక్షుడు సాయిల్ల సంతోష్‌ను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శంకరపట్నం: అసెంబ్లీ ముట్టడికి వెళ్తారన్న సమాచారం మేరకు విద్యార్థి సంఘం నాయకులను కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. తాడికల్, ముత్తారం గ్రామాలకు చెందిన నలుగురు విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేసి మధ్యాహ్నం విడిచిపెట్టారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

గంగాధర: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కరాటే పోటీల్లో వివేకానంద పాఠశాలకు చెందిన 95 మంది విద్యార్థులు పాల్గొని వివిధ స్థాయి బెల్టులు సాధించినట్లు కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కరాటే చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్, శిక్షకుడు శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ గుడి అనంతరెడ్డి, హెచ్ఎంలు నర్సింగరావు, ఉషారాణి అభినందించారు.

కూచిపూడిలో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న లవనిప్రియ

హుజూరాబాద్: బాసరలోని సరస్వతి కల్యాణ మండపంలో ఇటీవల నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పట్టణానికి చెందిన లవనిప్రియ అనే విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. ప్రముఖ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతిస్వామి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

ఉచిత దంత వైద్యశిబిరం



హుజూరాబాద్: తుమ్మనపల్లి గ్రామంలోని ఏకశీల పాఠశాలలో ఉచిత దంత వైద్యశిబిరం శనివారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చిదురాలు తెలిపారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అమత్, మహేశ్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేశ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

శంకరపట్నం: మక్తలో విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొంది. వీణవంక మండలంలోని మానేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలించి తిరిగి వెళ్తూ స్తంభాన్ని ఢీకొనడంతో జేసీబీతో తొలగించారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జీవ వైవిధ్య రక్షణ చర్యలు చేపట్టాలి

వీణవంక: తాగునీటి వనరులను సంరక్షించుకునేందుకు జీవ వైవిధ్య రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని బాల వికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. పోతిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి వనరులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సునీత, బాల వికాస కోఆర్డినేటర్ సుమలత, స్వాతి, ఆసియా తదితరులున్నారు.

రుణాల కోసం ఎదురుచూపులు

- ఈ సంవత్సరంలో నాలుగు నెలల వీఎల్ఆర్ కింద రూ.కోటి విడుదల
- గత బీఆర్ఎస్ పాలనలో నాలుగు సంవత్సరాలు పెండింగ్
- దాదాపు రూ.10కోట్ల నుంచి రూ.12కోట్లు రావాల్సి ఉంది
- సంవత్సరానికోసారి వీఎల్ఆర్ విడుదల చేయాలంటున్న మహిళలు



చిగురుమామిడిలోని ఐకేపీ కార్యాలయంలో సమావేశమైన వీవో సంఘాల మహిళలు, సీఏలు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వం వడ్డీ లేని(వీఎల్ఆర్) రుణాలు అందించడం లేదు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి మహిళలకు పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణాలను తక్షణమే విడుదల చేస్తామన్నారు. కాని అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు గడుస్తున్నా.. కేవలం నాలుగు నెలలకు సంబంధించిన వీఎల్ఆర్ కింద రూ.కోటి మాత్రమే విడుదల చేసింది. సంవత్సరంలో మిగిలిన 8 నెలల వీఎల్ఆర్ రావాల్సి ఉంది. బ్యాంకు లింకేజీ, సీసీఎల్ కింద స్వశక్తి మహిళలు తీసుకున్న రుణాలపై ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోంది.

51.10కోట్ల రుణాలు

మండలంలోని 17 గ్రామాల 990 స్వశక్తి సంఘాల్లో 10,316 మంది మహిళలున్నారు. వీరు బ్యాంకు లింకేజీ, సీసీఎల్ కింద దాదాపు రూ.51.10కోట్ల రుణాలు తీసుకున్నారు. ప్రతి మహిళ సగటున రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలతో తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటూ తిరిగి ప్రతి నెలనెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ప్రతినెల రికవరీ 99 శాతం ఉండటం విశేషం.

రూ.కోటి జమ

2023 డిసెంబర్ 9 నుంచి 2024 మార్చి నెల వరకు 4 నెలలకు సంబంధించిన వీఎల్ఆర్ కింద ప్రస్తుత ప్రభుత్వం రూ.కోటి అందించింది. హైదరాబాద్ నుంచి నేరుగా స్వశక్తి సంఘాల మహిళల పొదుపు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన ఎనిమిది నెలలకు సంబంధించిన వడ్డీ లేని రుణాలను ఇంకా ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ లెక్కన ప్రభుత్వం ప్రతి సంవత్సరానికి ఒక స్వశక్తి సంఘానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.

సీసీఎల్ ద్వారా అందజేత

ప్రతి మహిళ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా నెలనెలా చెల్లిస్తున్నారు. ఇలా సంవత్సరంపాటు చెల్లించిన రుణాలను తిరిగి వారికే సీసీఎల్(క్యాష్ క్రెడిట్ లోన్) ద్వారా అందించడం విశేషం. ఇలా వారు చెల్లించిన డబ్బులనే మరల సీసీఎల్ ద్వారా పొందడంతో వారు ఎంతగానో ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో స్వశక్తి సంఘాల మహిళలకు రావాల్సిన వడ్డీ లేని రుణాలు నాలుగు సంవత్సరాలవి నేటికీ రాలేదని ఆయా గ్రామాల వీవో సంఘాల మహిళలు తెలిపారు. ఇదేమిటని ఐకేపీ సిబ్బందిని ప్రశ్నించగా.. నిజమే గత ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. దాదాపు రూ.10 నుంచి రూ.12కోట్లు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టినా లేక కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాటు చేసినా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో మహిళలు తరలివెళ్లారు. హైదరాబాద్‌కు ఒకసారి, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు పలుమార్లు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఎల్ఆర్‌ను మాత్రం విడుదల చేయలేక పోయిందని పలువురు ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన గత పాలకులు వడ్డీ లేని రుణాలను సకాలంలో విడుదల చేయలేదు. దీంతో మహిళలు తీసుకున్న అప్పుతోపాటు వాటికయ్యే మిత్తి డబ్బులను కూడా వారే చెల్లించారు. తాము చెల్లించిన పిదప ప్రభుత్వం వీఎల్ఆర్‌ను విడుదల చేయడంతో తమకు సకాలంలో ఉపయోగపడటం లేదని మహిళలు తమ మనోగతం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాల్లో జమ



ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత 4 నెలలకు సంబంధించిన వీఎల్ఆర్ రూ.కోటి నేరుగా హైదరాబాద్ నుంచే బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. గత ప్రభుత్వ పాలనలో మహిళలకు వడ్డీ లేని రుణాలు రావాలి.

- మట్టేల సంపత్, ఏపీఎం, చిగురుమామిడి



నునుగొండపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

పరిహారం అందించాలి

చొప్పదండి: మండలంలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం పరిశీలించారు. చొప్పదండి శివారులోని ప్రవీణ్‌రెడ్డి మొక్కజొన్న క్షేత్రంతోపాటు వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం పరిశీలించారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారమివ్వాలని ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ఇప్పనపల్లి సాంబయ్య, లోకరాజేశ్వర్‌రెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, నలుమాచు రామకృష్ణ, కొత్తూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్‌తో కలిసి శనివారం కొలిమికుంటలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, గుంటి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటించాలి

అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించి ప్రభుత్వం ద్వారా యుద్ధ ప్రాతిపాదికన నష్టపరిహారం రైతులకందేలా కృషి చేయాలని కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దొంతిసారపు సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. రుక్మాపూర్‌లో నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు.

నష్టపోయిన పంట వివరాలు నమోదు

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తామని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, ఏవో వంశీకృష్ణ తెలిపారు. శనివారం రుక్మాపూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తిరిగి పంట నష్టాన్ని అంచనా వేస్తామన్నారు. ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన మొక్కజొన్న పంట

రామడుగు: శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతోపాటు గాలి వీచడంతో మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. పంట చేతికందే దశలో బలమైన గాలివానతో దాదాపు వంద ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలిందని వ్యవసాయాధికారులు తెలిపారు. రూ.50లక్షల నష్టం వాటిల్లిందని మండల రైతులు వాపోయారు. పంట వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏవో త్రివేదిక తెలిపారు.

కార్యకర్తలకు తగిన గుర్తింపు



మాట్లాడుతున్న సుజిత్‌కుమార్

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీలో దశాబ్దకాలంగా కష్టపడుతున్న వారికి తగిన గుర్తింపు త్వరలోనే లభిస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. శనివారం గన్నేరువరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిస్థితులన్నీ చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్నారని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతోందన్నారు. కొమ్మెర రవీందర్‌రెడ్డి, ముస్కు ఉపేందర్‌రెడ్డి, దేశరాజ్ అనిల్, చాడ సతీశ్‌రెడ్డి, ఏలేటి సతీశ్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా కోర్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న రాజేందర్

తిమ్మాపూర్: మాదిగ హక్కుల దండోరా కోర్ కమిటీ సమావేశం రామకృష్ణకాలనీలో జిల్లా నాయకుడు ఎల్కపల్లి రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌మాదిగ, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హాజరయ్యారు. మాదిగ హక్కుల దండోరా కోర్ కమిటీ గౌరవాధ్యక్షురాలు అందెల భవానిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజారాణి, వడ్లూరి శ్రీనివాస్, ప్రవీణ్, మాట్ల రమేశ్, నృతారి రవీందర్, చిలుక రాజేశం, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మసీదుకు మైక్ సెట్ అందజేత



గంగాధర: మంగపేట శివారులో ముస్లింలు 12 సంవత్సరాల క్రితం మసీదును నిర్మించుకున్నారు. మసీదుకు మైక్ సెట్ కావాలని కమిటీ సభ్యులు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డిని సంప్రదించగా.. రూ.30వేల మైక్‌సెట్, సౌండ్ సిస్టమ్ కానుకగా ఇచ్చారు. శనివారం మిత్ర మండలి సభ్యులు మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. సయ్యద్ ఇమామ్, షేక్ కసీం, హుస్సేన్, కరీం, మొహినొద్దీన్, మౌలాన, షేక్ అలీ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్, టీషర్టులు అందజేత



గన్నేరువరం: లయన్ భవన్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకన్న జన్మదినం పురస్కరించుకొని ఖాసీంపేట గ్రామ క్రికెట్ జట్టుకు క్రికెట్ కిట్, టీషర్టులను గ్రామంలో శనివారం అందజేశారు. క్రీడాకారుల మధ్య కేక్ కట్ చేశారు.



విద్యార్థుల క్షేత్ర సందర్శన

శంకరపట్నం: వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శించారు. ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్ట్, కాళేశ్వరం దేవాలయం, భూపాలపల్లి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేశారు. కాళేశ్వరం ఆనకట్ట, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం కోటేశ్వర్‌రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శంకర్

జమ్మికుంట: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ పిలుపునిచ్చారు. శనివారం వావిలాల గ్రామంలోని పంచాయతీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు పెరుగు అశోక్, మండల కార్యదర్శి లద్దునూరి కుమార్, రవీందర్, నరేశ్, మధునయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన



హుజూరాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్ వద్ద ధర్నా చేస్తున్న అసంఘటిత కార్మికులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ నాయకులు ఆందోళన చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే కార్మికుల గొంతులను అరెస్టులతో ఆపాలని చూస్తే ప్రభుత్వానికి సరైన సమయంలో గుణపాఠం తప్పదన్నారు. కొంకట చంద్రయ్య, రత్నాకర్, చిరంజీవి, కొడిమెల వెంకటేశ్, మోర మహేశ్, అన్నపు రమేశ్, మల్లారపు రవి, పోలిశెట్టి ప్రభు, శంకర్, మైస తెరాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం



చిగురుమామిడి: నీటి సంరక్షణ డ్రాయింగులతో విద్యార్థులు

హుజూరాబాద్: సిర్సపల్లి గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నీటి ప్రాముఖ్యంపై సభ్యులు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటి ప్రతిజ్ఞ చేశారు. రజిత, కల్యాణి, ఆకునూరి లింగయ్య, సత్తమ్మ తదితరులున్నారు.

చిగురుమామిడి: చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, నాటక, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడితే భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎల్ఆర్ఎస్ చెల్లింపులు వేగవంతం చేయండి



ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న కమిషనర్ ఎండీ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో వార్డు ఆఫీసర్లు ప్రత్యేక కార్యాచరణతో ఎల్ఆర్ఎస్ చెల్లింపులు వేగవంతం చేయాలని కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శనివారం మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వార్డువారీగా ఎల్ఆర్ఎస్ చెల్లించే వారి వివరాలు అందించామని, మార్చి చివరి వరకు ఎల్ఆర్ఎస్ చెల్లించే వారు 25 శాతం మినహాయింపు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ కట్టిన వారికి ప్రొసిడింగ్‌లు అందజేశారు. మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ నరేశ్, టీపీఎస్ ప్రదీప్, టీపీబీవో దీపిక, జేఏవో రాజశేఖర్, ఆర్ఐ భాస్కర్, వాణి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



ఎస్సైని సన్మానించిన నాయకులు

గంగాధర: గంగాధర పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై వంశీకృష్ణను శనివారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైకి శాలువాలు కప్పి సన్మానించారు. నవీన్‌రావు, మహిపాల్‌రావు, సురేందర్, జోగు సాగర్ తదితరులున్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికయిన కాయిత రాములు, కామని రవీందర్‌ను మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్య సన్మానించారు. అసోసియేషన్ బాధ్యులు బొంగోని వెంకటయ్య, సయ్యద్ మునీరుద్దీన్, రావికంటి రామకృష్ణయ్య, శనిగరం నరేందర్, చీకట్ల సమ్మయ్య, మండల వీరస్వామి, నాయకులు గుడిపాటి జయపాల్‌రెడ్డి, ఖలీద్ హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, పటేల్, ఆలేటి రవీందర్, సందేల వెంకన్న తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక



బొమ్మనపల్లి అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం

చిగురుమామిడి: మండల రైతు సంఘం మహాసభ శనివారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో మండలంలోని 17 గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా ఓగులాపూర్ మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సీతారాంపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఎనగందుల రాజయ్య, అందె స్వామి, మంద ఎల్లయ్య, గూడెం లక్ష్మి పాల్గొన్నారు.

బొమ్మనపల్లి గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులందరూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, నాయకుడు చిన్నరాజయ్య తెలిపారు. అధ్యక్షుడిగా కొంకట విజయ్, ఉపాధ్యక్షులుగా తాల్ల మురళి, కొంకట నవీన్, ప్రధాన కార్యదర్శిగా మిట్టపెల్లి శివకుమార్, సహాయ కార్యదర్శిగా కొంకట ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా కొంకట క్రాంతికుమార్, ప్రచార కార్యదర్శిగా మాతంగి శ్రవణ్, సభ్యులుగా మిట్టపెల్లి సురేందర్, కొంకట మహేందర్, కొంకట సాగర్, కాంపెల్లి శివ, దప్పు సదానందం, మొలుగూరి శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

కేసీఆర్ కేసు పెడితే.. రేవంత్‌రెడ్డి జైలుకు పంపిండు



మాట్లాడుతున్న ఎండీ హుస్సేన్

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ఫాసిస్ట్ పాలనలాగే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్బంధాలతో నడుస్తోందని, ప్రశ్నించే విధానం లేకుండా మాజీ మావోయిస్టులపై కేసీఆర్ తప్పుడు కేసులు పెట్టగా.. రేవంత్ అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నారని సికాస వ్యవస్థాపకుడు, మాజీ మవోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఎండీ హుస్సేన్ అలియాస్ రమాకాంత్ ఆరోపించారు. 9 నెలల జైలు జీవితం గడిపిన అనంతరం జైలు నుంచి విడుదలై స్వగ్రామమైన జమ్మికుంటలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. తనకు సంబంధం లేని కేసుల్లో బాధ్యున్ని చేసి జూలైలో జమ్మికుంటలోని ఇంటి నుంచి బలవంతంగా తీసుకెళ్లి మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో తప్పుడు కేసు నమోదు చేసి బెయిల్ సైతం రాకుండా జైలులో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మావోయిస్టుల ఎజెండా అని ప్రభుత్వంలోకి వచ్చాడని, ఆ పాలనతో విసిగిపోయి ప్రజలు ప్రజాస్వామిక పాలన సాగిస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు.

ఇఫ్తార్ విందు



రామడుగు: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జవ్వాజి హరీశ్, కోల రమేశ్, పంజాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.